# తాతగారూ.. తెలుగు చిత్రహింసా

తెలుగు భాషకు ప్రాచీన హోదా వచ్చిందన్న శుభవార్త మా ఇంట్లో పెద్ద పండగ వాతావరణాన్ని తెచ్చిందనే చెప్పాలి. ఎందుకంటే మా ఆవిడకు దూరపు బంధువు వరుసకు తాతయ్య అవుతారులెండి. ఆయన రెండున్నర దశాబ్దాల క్రితం తెలుగు పండితునిగా పదవీ విరమణ చేసి ఇప్పటికీ తన పనులు తాను చేసుకుంటూ ఆరోగ్యంగా వున్నారు. బామ్మగారు లేవలేని స్థితిలో వుంటే ఆమెను కొడుకు ఇంట్లో ఉంచి, తాను మాత్రం ఇలా బంధువుల ఇళ్లలో సరదాగా కాలక్షేపం చేస్తుంటాడు. తల మీద చుట్టూ నాలుగు పోగుల జుట్టు, ఖద్దరు లాల్చీ, రెండు రంగుల అంచులు వున్న ఖద్దరు పంచె, భుజాన కండువా, వీటిలో వేలాడుతున్న ఆయన శరీరం, ఎడమ చేతిలో నశ్యం డబ్బా, ఇదీ ఆయన స్వరూపం.

కేబుల్ ప్రసారాల్లో ఈ వార్త రావడం ఆలస్యం కిలో పంచదార తెప్పించి మా అందరి నోళ్లలోను బలవంతంగా పోశారాయన, స్వీట్లు తెప్పించడం ఆలస్యం అవుతుందని. ఇంకా ఆయన ఆ ఆనందకరమైన వార్త నుండి తేరుకోలేదు.

ఇంతలో హోమ్ సిక్ శెలవంటూ మా పెద్దాడు గోపాలం ఇంజనీరింగ్ కాలేజి నుండి వచ్చాడు. వస్తూనే హాలులో రైలింజను పొగలా నోట్లోంచి చుట్ట పొగ వదులుతూ తన్మయత్వంలో కనులు మూసుకుని హాయిని అనుభవిస్తున్న తాతయ్యను పలకరించకపోయినా బావుండేది.

"హాయ్ తాతయ్యా!... మై హార్టీ కంగ్రాట్స్ టు యూ. మీ తెలుగు పాత భాషల్లో కలిపేసేరట గదా" అన్నాడు. అంతే కొంప మునిగింది. "బడుద్ధాయ్!.. అసలు నువ్వు అ,ఆ, లు దిద్దేవా లేక ఎబిసిడిలు నేర్చావా. శుభాకాంక్షలు అనడం నేర్చుకోరా లక్షణంగా.." అంటూ వచ్చిన కోపాన్ని తగ్గించుకోవడానికి చిటికెడు నశ్యం ముక్కులోకి రవాణా చేశారు. "ఒక్క క్షణం కూర్చోరా. నీకు కొన్ని అచ్చ తెలుగు మాటలు నేర్పుతాను..." అంటున్న ఆయన్ను ఇబ్బందిగా చూస్తున్న గోపాలాన్ని తల్లి వచ్చి "ఇప్పుడే వచ్చేడు ప్రయాణం చేసి. ఫ్రెష్ అయి వస్తాడు లెండి" అంటూ రక్షించింది. బ్రతుకు జీవుడా అని గోపాలం లోపలకి వెళ్లిపోయేక "అదిగో నువ్వు ఆ అంట్ల భాష వదలడం లేదు సుమా" అంటూ ఆమె మీద విరుచుకుపడడంతో మారు మాట్లాడకుండా లోపలకు వెళ్లిపోయింది.

నాకు ఆఫీసుకు టైమయిపోవడంతో "ఏమే ఎక్కడున్నావ్, బై" అంటూ వెళ్ళబోతున్న నన్ను ఆపి "ఓరేయ్.. తెలుగు మాట్లాడండిరా. శుభ్రంగా వెళ్లివస్తానని చెప్పరా. అసలు మీరు మన భాషను ఎప్పుడు ప్రేమిస్తారు రా.. నా తెలుగును అన్యభాషతో కలిపి కలుషితం చేయకండిరా" అంటున్న ఆయన వేపు తిరిగి "సారీ తాతగారూ ఆఫీసుకు వెళ్లి వస్తా" అంటున్న నన్ను కోపంగా చూస్తూ "మిమ్మల్ని సరైన మార్గంలో పెట్టడం నావల్ల కాదురోయ్" అంటూ తల కొట్టుకుంటున్న ఆయన్ను చూస్తూ నేను నా తల పట్టుకుని బయటపడ్డాను.

మాతృభాషలో మాట్లాడడం అనుకున్నంత తేలిక కాదు. అయితే కొంచెం కష్టపడితే నెమ్మదిగా సాధించవచ్చును. కాని మా తాత అన్నట్లుగా ఉన్నపళంగా ఖచ్చితంగా స్వచ్ఛమైన తెలుగులోనే మాట్లాడాలంటే కుదిరే పనికాదు.

-000-

"మా తెలుగు తల్లికి మల్లెపూదండ" అనే పాటను తాతగారు తన్మయత్వంతో కళ్లు మూసుకుని గానం చేస్తూ అమితానందం అనుభవిస్తున్న తరుణంలో దోబూచులాటలో దాక్కున్న పిల్లాడు ఎక్కడ దాక్కున్నాడో రహస్యంగా చూసే పిల్లాడిలాగా, తాతగారు హాలులో ఏం చేస్తున్నారని చూసి, ఒక వేళ నిద్రపోతుంటే ఆయన కళ్ళ పడకుండా జారుకుందామని పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ. గుమ్మంలోంచి తొంగి చూస్తున్నాడు గోపాలం. కనులు మూస్తూ తెరుస్తూ తెలుగుతల్లి పాటను గానం చేస్తున్న తాతగారి కళ్ళలో తొంగి చూస్తున్న గోపాలం ముఖారవిందం కంటపడనే పడింది.

"వెధవాయ్ గుంట నక్క లాగా బాగానే తొంగి చూస్తున్నావ్ గాని నీ కోసమే ఎదురు చూస్తున్నాను. లోపల ఏం చేస్తున్నావ్ రా ఇంతసేపూ. నాలుగు మంచి మాటలు పెద్దాళ్ల దగ్గర నేర్చుకోండి రా బాగుపడతారు.." అంటూ నస మొదలుపెట్టారు. దొంగతనం చేస్తున్న దొంగ ఆ ఇంట్లో వాళ్లకే రెడ్ హేండెడ్‌గా దొరికిపోయిన వాడిలా ముఖం పెట్టాడు గోపాలం. "అదేంట్రా అలా పిచ్చోడిలా చూస్తున్నావ్. మనం తెలుగు వాళ్లం, తల ఎత్తుకుని జీవించాలి. ఇలా రా కూర్చో.." అంటూంటే ఇక తప్పలేదు గోపాలానికి. డాక్టరు దగ్గర ఇంజక్షన్ చేస్తానంటాడేమోనని భయం భయంగా చూస్తూ కూర్చున్న పిల్ల వాడిలా కూర్చున్నాడు గోపాలం.

"అరేయ్ నువ్వు పదో తరగతి దాకా తెలుగు చదివేవా..." "నేను ఇంగ్లీష్ మీడియంలో చదివాను తాతయ్యా కానీ సెకండ్ లాంగ్వేజ్ తెలుగే. అందువలన తెలుగులో బాగా చదవగలను, వ్రాయగలను, ఇదిగో ఇలా ధారాళంగా మాట్లాడగలను" అన్నాడు ఎంతో ధైర్యంగా.

ఇలా చెబితే సంబరపడిపోయి తాతయ్య వదిలేస్తాడనుకున్నాడు పాపం. కాని ఈ మాటలు గోపాలం పాలిట శాపాలయ్యాయి. ఆయనకు జుట్టు చేతికి ఇచ్చి గెంతులేసినట్టయింది. "వెరీ గుడ్, బావుంది నీ తెలుగు భాషా పరిజ్ఞానాన్ని పరీక్ష చేస్తాను. రెండే రెండు ప్రశ్నలకు జవాబు చెప్పేసి వెళ్లిపోదువుగాని..." అన్నారు తాతగారు తెలుగు పండిట్ ఫోజు పెట్టి "చెప్పండి తాతగారూ. నేను వెళ్లి నా పుస్తకాలు కొనుక్కోవాలి" అన్నాడు గోపాలం. "తెలుగులో అక్షరాలు ఎన్ని రా.."

"వెరీ సింపుల్, ఇది తెలియని వారెవరుంటారు? మీరు మరీనూ. తెలుగులో అక్షరాలు పదహారు". కొంప మునిగింది. గోపాలం నెత్తి మీద ఆయన పాత అలవాటు ప్రకారం ఒక చిరు మొట్టికాయ తగిలించి.. "వెధవాయ్ బురదలో కాలేశావ్, తెలుగులో ఏభైఏడు అక్షరాలు, అచ్చులు పదహారు, హల్లులు ముప్పయి ఎనిమిది ఉభయాక్షరాలు మూడు తెలిసిందా,,?" అని ఆయన చెబుతుంటే "అ ఉండి అః వరకే గదా తెలుగు అక్షరాలు"అన్నాడు. పోనీ మర్చిపోయానండీ అని వుంటే ఎలా వుండేదో. "నీ బొంద గుణింతాలు తెలుసునా? క గుణింతం చెప్పు పోనీ.." "క కా కు కూ కం కః" అన్నాడు సింపుల్‌గా చాలా చిరాకుగా. "అదిగో తెలుగు అక్షరాల తెలియవు, గుణింతాలు రావు, అయినా సరే ఇంజనీరింగ్‌లో చేరిపోయావ్. ఎవడు రా నిన్ను ఇంజనీరింగ్‌లో చేర్చుకున్నది. మీ చదువూ చట్టబండలూ ఇలాగే చచ్చాయి..." అనుకుంటూ కోపంతో నశ్యం డబ్బా తీసిచిటికెడు నశ్యం ముక్కులోకి రవాణా చేశారు. ఇంతలో గజేంద్రుణ్ణి రక్షించడానికి వచ్చిన విష్ణుమూర్తిలా గోపాలం తల్లి వచ్చి... "గోపాలం పొయ్యి మీద పోపు పెట్టాను గాని వెళ్లి మినపపప్పు పట్రా అర్జెంటుగా..." అంది. వెంటనే తాతగారితో కూడా చెప్పకుండా తుర్రుమన్నాడు. గోపాలం వెళ్లాక.. "అమ్మాయ్ నువ్వు రోజూ మాట్లాడేటప్పుడు కూడా సాధ్యమైనంత వరకూ తెలుగు పదాలు మాట్లాడాలమ్మా, అర్జెంటుగా అనే బదులు త్వరగా లేదా జరూరుగా అనాలి. ఇక నుండి అలా చేస్తూవుండు" అన్నారు తాతగారు.

"అలాగేనండి. ఏమిటో ఇంగ్లీషు నిత్య జీవితంలో ఒక భాగమైపోయింది" అంది. "అందుకేనమ్మా ఇంగ్లీషోడు మనల్ని రాజ్యం ఏలింది. ఇంకా మనం సిగ్గు లేకుండా మన పిల్లల్ని అమెరికాలు, ఇంగ్లాడులూ పంపించేస్తున్నాం. వాళ్లకు బానిసలుగా బ్రతకమని" అంటూ నణుగుతుంటే - "మాయ మేళం, ఏదో ముసలాడు ఇంటికి కాపలాగా పడుంటాడు. నాలుగు మెతుకులు తింటాడు అనుకుంటే, తెలుగు భాష పిచ్చితో బుర్రలు తినేస్తున్నాడు." అని నణుగుకుంటూ లోపలకు వెళ్లిపోయింది గోపాలం తల్లి.

-000-

సాయంత్రం ఆరు గంటలవుతుంది. తాతగారు టీ తాగి, అప్పుడే తులం నశ్యం ముక్కు లోకి రవాణా చేసి, ఒక లంక పొగాకు చుట్ట వెలిగించి గుప్పు గుప్పు మంటూ పొగ వదులుతూ మధ్య మధ్యలో

అక్కకు చుక్కకు క వత్తు

మొగ్గకు బుగ్గకు గ వత్తు

అంటూ పాడుతున్నారు. "ఏమిటో వెధవది, ఇప్పుడు మేస్టర్లు తెలివి మీరిపోయారు. ఈ వత్తుల పాట పిల్లలకు నేర్పించి కంఠతా పట్టిస్తే వత్తులు నిద్ర లేపి అడిగితే చెప్పేవారు. ఇప్పుడు పిల్ల వెధవలకి వత్తులకు ఎక్కడ పెట్టాలో తెలిసి చావదు. అవసరంలేని చోట వత్తులు పెట్టేసి తెలుగు తల్లిని చిత్రవధ చేస్తున్నారు. చాలా మంది 'భాద' అంటారు కాని 'బాధ' అని అనాలని తెలియదు మాయదారి గోల, ఏమిటో" అంటూ తనలో తాను అనుకుంటున్నారు.

పగలంతా ఆఫీసులో పనిచేసి, అలసిపోయి కిక్కిరిసిన సిటీబస్‌లో ప్రయాణం చేసి వాడిపోయిన తోటకూర కాడలా నడుచుకుంటూ ఇంట్లో అడుగు పెట్టాను. అడుగు పెట్టడం ఆలస్యం ఉభయభాషాప్రవీణ తాతగారు గానం చేస్తూ ప్రత్యక్షమయ్యారు. ఆయన నోట్లో నుంచి వస్తున్న చుట్టపొగ మబ్బుల్లో ఆయన నాకు గంటంతో తాళపత్ర గ్రంథాలపై వ్రాస్తున్న ప్రాచీన కవిసార్వభౌమునిలా కనిపించారు. అందుకే నాకు పెద్దలంటే వల్లమాలిన గౌరవం. ఆ గౌరవం, ఇష్టం కూడా ఒక్కోసారి ఇబ్బందికరంగా పరిణిమిస్తుందని అనుకోలేదు. "అబ్బాయ్. కాళ్లు చేతులు కడుగుకుని కాస్త కడుపులోకి ఏదైనా ఎంగిలి పడి నా దగ్గరకు వచ్చి కూర్చున్నావనుకో, నాలుగు ముక్కలు తెలుగు నేర్చుకుందువుగాని నీకు తెలియదని కాదు సుమా. ఇప్పుడు ప్రభుత్వం తెలుగులో ఉత్తరప్రత్యుత్తరాలు చేయాలని నిబంధన పెట్టి, ఎక్కువగా తెలుగులో ఉత్తరాలు వ్రాసిన ఉద్యోగులకు బహుమతులు ఇస్తోందిట కదా. కొంచెం భాషాజ్ఞానం వుందనుకో చకచకా ఎక్కువ ఉత్తరాలు రాసేసి నువ్వే ఆ బహుమతి కొట్టేయచ్చు. ఏమంటావ్. అయినా నాలాంటి పండితులు గతించారనుకో, మీకు నేర్పేవాళ్లెవరుంటారు రా" అంటూ సెంటిమెంటల్ దెబ్బ కొట్టారాయన.

మరి ఇక వెళ్లి నా శ్రీమతి చేసిన సాయంకాలం టిఫిన్ తిని టీ తాగి బయటకు వచ్చి తాతగారి పడక కుర్చీకి దగ్గరగా కుర్చీ లాక్కునికూర్చున్నాను. "అబ్బులూ, నీకు పెద్దలంటే గల వినయవిధేయతలు చూస్తేంటే నాకు ఎంతో మురిపెంగా వుంటుంది రా. అందుకే నువ్వు ఈ వేళ మంచి ఉద్యోగం చేస్తూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుఖంగా వున్నావు సుమా" అన్నారాయన నన్ను పొగుడుతూ. ఈ పొగడ్తల వెనుక నాకు చిత్రహింస

అను కార్యక్రమం వున్నదని తెలుసును అయినా రోటిలో తల పెట్టి రోకలి పోటులకు భయపడనేల అన్న సామెత గుర్తు తెచ్చుకుని.. " దానిదేముందిలెండి. నాకు చిన్నతనం నుండీ అమ్మానాన్నా లేక పోవడంతో పెద్ద వాళ్లంటే ఒకింత గౌరవం, భక్తి ఎక్కువ" అన్నాను.

తాతగారు ఉపన్యాసం మొదలు పెట్టారు. "నువ్వు ఎప్పుడు తెలుగు చదివావో ఏమో, తెలుగు అక్షరాల నుండి చెప్తాను. తెలుగు అక్షరాలు ఏభై ఏడు, అచ్చులు పదహారు, అయితే ఇవి ప్రాణాక్షరాలు. హల్లులు ముప్ఫయి ఎనిమిది, ఇవి వ్యంజనములు అనుకో, ఉభయాక్షరాలు మూడు. ఇకపోతే గుణింతాలు అంటే ప్రతి అక్షరానికి అచ్చులను అన్వయించడమే. అదిక గుణింతం అవుతుంది. ఇలాగ అచ్చులలో నాలుగు రకాలు వున్నాయి. హ్రస్వములు, ధీర్ఘములు, వక్రములు, వక్రతమములు ఇక హల్లులలో ఏడు విభాగాలున్నాయి. మీకు చదువుకునేటప్పుడు సంధులు, సమాసాలు, అలంకారాలు, చెప్పేరా అవి కూడా నెమ్మదిగా చెబుతాను. అది సరే మనం నిమ్మళంగా చెప్పుకుందాం. నీకు తెలుగులో వున్న పరిజ్ఞానాన్ని తెలుసుకోవడానికి రెండు ప్రశ్నలు వేస్తాను. 'కామా'ని తెలుగులో ఏమని పిలుస్తారు? 'ఏమంటారు కోమా అనే అంటాం" అన్నాను "కాదురా నీ బొంద, వాక్యాంశ బిందువు అంటారు తెలుసుకో" "ఫుల్‌స్టాప్'ని ఏమంటారు" "అదేముందీ చుక్క అంటాం" అన్నాన్నేను. "కాదురా పిచ్చోడా వాక్యం చివర బిందువు అనాలి" అన్నారు తాతగారు బోసి నవ్వుతో.

ఈ రోజంతా ఆఫీసులో ఏవో పిచ్చి పిచ్చి కాగితాలన్నీ రాసి రాసి నా తల దిమ్ముగాను, చాలా చిరాకుగానూ ఉంది. ఈ ఆపద నుండి నన్నెవరు కాపాడతారు రా బాబూ అని శ్రీకృష్ణుడు తనను చంపడానికి వెంటాడుతుంటుంటే గయుడు నన్నెవరు రక్షిస్తారా అని ప్రార్థించినట్లుగా మనసులో ప్రార్థిస్తున్నాను. దిక్కులు చూస్తున్నాను. ఈ లోగా ఆయన నశ్యం డబ్బా తీశారు. ఇంతలో నా సెల్ రింగయింది. "హలో తాతగార్ని పిలవనా" అని, ఆయనకు సెల్ ఇచ్చాను. "అలాగే ఈ క్షణమే బయల్దేరుతున్నాను" అంటూ వురేయ్ నన్ను వెంటనే మా ఊరి కారు ఎక్కించు. బామ్మకి బాగా లేదంట. నన్ను కలవరిస్తూందట" అంటూ గబగబా లోపలకు వెళ్లి తన కర్రల బ్యాగ్ తెచ్చేసుకుని నిలబడ్డారు. ఈ లోగా నా సుపుత్రుడు గోపాలం వచ్చాడు. "ఏమిటి నాన్నగారూ తాతగారు కంగారులో వున్నారు?" అన్నాడు.

"ఇప్పుడే ఫోను వచ్చింది రా బామ్మకి బాగాలేదని" అన్నానో లేదో వెంటనే "నేను నాబండి మీద తీసుకెళ్తాలెండీ" అంటూ తాతగారి చేతిలో సంచీ లాక్కుని తాతగార్ని తీసుకుని వెళ్లిపోయాడు. "ఏమిటో పాపం బామ్మగారికి బాగా లేదుట తాతగార్ని

పంపించేశాను, ఆ కంగారులో నీకు కూడా చెప్పకుండా అమ్మాయికి చెప్పమని వెళ్ళిపోయారు హడావిడిగా" అన్నాను లోపలికి వచ్చి నా శ్రీమతితో. "నాబొంద ఆవిడ అప్పుడే ఎక్కడ పోతుందీ, రోజూ ఆవిడకు ఇష్టమైన పిండి వంటలూ కూరలూ, కుమ్మే కోడల్ని రాచి రంపాన పెట్టి మరీ చేయించుకుని మింగుతూనే ఉంది. నేనే మన చంటాడిని బయట నుండి ఫోన్ చెయ్యమన్నాను బామ్మకు సీరియస్‌గా వుందని" అంది "అమ్మయ్య బ్రతికించావ్.." అని లోపల అనుకుంటూంటే "లేకపోతే ఏమిటండీ ఏదో నాలుగురోజులు అమ్మానాన్నల దగ్గర వుండాలని వచ్చిన పిల్లాడిని తెలుగు భాషతో చంపేస్తున్నాడనుకోండి. వాడు వుండడానికి భయపడి పోతున్నాడనుకోండి. మీరెవరూ లేనప్పుడు నన్ను తింటున్నాడు. అప్పుడప్పుడు మిమ్మల్ని వాయించేస్తున్నాడు, ఇప్పుడేమో హోమ్ సిక్‌తో శెలవులకి వచ్చిన చంటాడ్ని ఇబ్బంది పెడుతున్నాడు. అందుకే.." అంటున్న ఆమెని ప్రశంసాపూర్వకంగా చూస్తూ "మా తెలుగు తల్లికి మల్లె పూదండ.." అంటూ రాగం తీయడం మొదలు పెట్టడం ఆలస్యం "ఆపండిక మాయగోల.." అని గర్జించింది శ్రీమతి. ●

(స్మైల్ ప్లీజ్ నవ్వండి, మాసపత్రిక, జూన్ 2011)